కథ

# దొరుకునా ఇటువంటి సేవ...

భీమవరపు పురుషోత్తమ్

పదో తారీఖు దాటిందంటే మా బ్యాంకు మెయిన్ బ్రాంచిలో పండగ వాతావరణం నెలకొంటుంది. బ్యాంకులో పన్జెయ్యకుండా వీళ్లకి పండగేంటంటారా?

ట్రెజరీ బ్రాంచి కాబట్టి మొదటి వారమంతా పెన్షనర్ల జీతాల చెల్లింపులు, ప్రభుత్వ బిల్లు క్రెడిటింగ్ ఇతరత్రా రొటీన్ వర్క్‌తో బుర్రలు, భుజాలు వాచిపోయుంటాము. ముందు వరసలో కూర్చునే సైనికుల్లాంటి క్లర్కులం.

ఇక లోపల కూర్చునే పటాలాన్ని బ్రిగేడియర్ మేజర్‌లాంటి పదాలతో సంబోధించవచ్చు...ముఖ్యంగా బ్రిగేడియర్‌లాంటి అకౌంటెంటు సీటు కొత్త సినిమా అడ్వాన్సు బుకింగ్ కౌంటరులా, కొత్త పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్ల పంపిణీ కార్యక్రమంలా సందడిగా రద్దీగా ఇంకా చెప్పాలంటే గొడవగా ఉంటుంది.

ఆ పక్కనే మేజర్ గది...అదే మేనేజరు గది కూడా. ఇంచుమించు అదే జనసందోహంతో కోలాహలంగా ఉంటుంది. లోన్ల కోసం వచ్చిన వాళ్లు జోకులేసి నవ్వించి ఆయన్ని కాకా పట్టాలని చూస్తే, డిపాజిట్లు చేయడానికి దర్జాగా వచ్చే వాళ్లని మేనేజరే బోలెడు జోకులేసి నవ్విస్తూ ఉంటాడు. మధ్యలో కట్టని లోన్లకు సంజాయిషీ ఇవ్వడానికి వచ్చే వాళ్లు ఎటు నవ్వాలో తెలీక వెర్రి మొహాలేసుకొని పిచ్చి నవ్వులు నవ్వుతుంటారు.

ఇక ఫీల్డాఫీసరు గది వెనగ్గా ఉంటుంది. అక్కడ లోన్లు శాంక్షనయిన వాళ్లు తాము తేవలసిన కాగితాలు అవీ తెల్సుకుంటూ ఉంటే... అప్పులు సగం తీర్చేసినవాళ్లు ఇంకా ఎంత కట్టాలో లెక్క తీయించుకొని, ''అయ్ బాబోయ్! ఇంకా ఇంత బాకీ ఉందండీ...ఆయ్!'' అంటూ కోనసీమ భాషలో ఆశ్చర్యపోతుంటారు.

క్యాష్ ఆఫీసరు ఇటు చివరగా ఉంటాడు. ఆయన గోల్డ్‌లోన్లిస్తూ, ఏటీఎమ్ కార్డులు ఇష్యూ చేస్తూ హడావిడిలో ఉంటాడు. హాల్లో ఇద్దరు స్పెషల్ అసిస్టెంట్లు...అటు ఆఫీసరు, ఇటు క్లర్కు కాని పోస్టువాళ్లది. అధికారం ఉండీ లేనట్లు, ఆపద్ధర్మ ప్రభుత్వంలో మంత్రి పదవిలా ఊరిస్తూ, మురిపిస్తూ ఉంటుంది వాళ్లకు.

ముగ్గురు మెసెంజర్లు హాల్లో చక్కర్లు కొడుతుంటారు. క్లర్కులు ఫీడ్ చేసిన ఓచర్లు, మోక్షం కోసం...అంటే పాసింగ్ కోసం, కైలాసానికి... అంటే అకౌంటెంటు సమక్షానికి తీసికెళ్లే ప్రమథ గణాల్లా ట్రేలో పడ్డ ఓచర్లపై, ప్రథమంగా తమ చూపుల మోక్షం పడ్డప్పుడు మాత్రమే అసలైన మోక్షానికి మోసుకెళుతుంటారు. ఈలోగా కస్టమర్లకు లేటు కష్టాలు తప్పవు.

ఇలా, తలకు మించిన పని భారం అనే సర్కస్ ఫీట్లతో కస్టమర్ల తిట్లూ, దీవెనలు, పొగడ్తల మధ్య వారం గట్టెక్కితే జనం పల్చబడ్డం ప్రారంభమయి, మా గుండె దడలు యథాస్థానాన్ని చేరుకుని, క్రమంగా పదో తారీఖు దాటేసరికి వాఘా బోర్డరులో పాకిస్థాన్ లోంచి ఇండియాలోకి అడుగు పెట్టినట్టు హృదయాలు ఉల్లాసభరితం అవడం ప్రారంభిస్తాయి. పని పల్చబడేసరికి ఆటోమేటిగ్గా మాటలు పెరుగుతాయి. మాటలు పెరిగితే నవ్వులు పెరుగుతాయి. మరి, నవ్వులు పెరగడమంటే పండగ వాతావరణమే కదా!

కానీ, ఈ మధ్య కొత్తగా సెక్యూరిటీ కోసం నిర్నిద్ర నేత్రాల్లా సీసీ (క్లోజ్‌డ్ సర్క్యూట్) కెమెరాలొచ్చాయి. అప్పుడే కొత్తగా తెలిసింది. మా నవ్వులు పువ్వులు మేనేజరుని బాధిస్తున్నాయని. బహుశా, ఆయనికి కూడా కొత్తగా తెలిసుంటుంది. మేం కూడా నవ్వగలమని! ఈ మధ్య ఆయన అయినదానికి కానిదానికీ మాపై చిర్రుబుర్రులాడడం చిరాకు పడ్డం చూస్తూ, తన పని మానేసి ఆత్రంగా అదే పనిగా తన రూములో కూర్చుని సీసీ కెమెరాలకు అనుసంధానం చేసిన టీవీని చూస్తున్నాడేమోనన్న అనుమానం, అందరికీ కాలుతున్న కరెంటు వైరు వాసనలా తగిలింది.

అందుకే ఈ మధ్య అంతా 'గోడలకు చెవులుంటాయి' అనే పాత కాలం డైలాగు మానేసి, 'గోడలకు కళ్లుంటాయి' అనే లేటెస్ట్ డైలాగు వాడుతున్నారు బ్యాంకులో. బ్యాంకు రక్షణ కోసం వచ్చి కెమేరాలు కాస్తా మాకు రక్షణ లేకుండా చేయడం శోచనీయం.

సీసీ కెమెరాలకి దొరక్కుండా ఎక్కడ మాట్లాడుకోవచ్చో, మనస్ఫూర్తిగా నవ్వుకోవచ్చో కనిపెట్టి మరీ అక్కడికి వెళ్లి స్టాఫు ఆ పని కాస్తా కానిస్తున్నారు. దరిమిలా, ఆ ఆత్రంలో పగలబడి నవ్వుతూ కెమెరాలో కంటే డైరెక్టుగా మేనేజరు కళ్లలోనే పడ్డవారూ ఉన్నారు. రెడ్‌హాండెడ్‌గా దొరికిపోయారు.

'నవ్వు' కాదు 'పని' కావాలన్నది. ఆయన సూత్రం...అన్నట్టు చెప్పడం మరిచాను. ఐదుగురు గార్డులు కూడా ఉన్నారు మా ఆఫీసులో.

ఆc! సడెన్‌గా గార్డులెందుకు గుర్తొచ్చారంటే? వాళ్లు మిలట్రీలో పన్జేసి బ్యాంకులోకొచ్చారు. మిలట్రీ గొడవ ఎందుకంటే మా మేనేజరు మిలట్రీలో ఉండాల్సిన వ్యక్తి. పర్సనాలిటీ రీత్యా కాదు సుమండీ మెంటాలిటీ రీత్యా.

ఈ మాట ఎందుకంటున్నానంటే.... స్టాఫ్ అందర్నీ ఆయన, 'ఎలా ఉంది మీ పని?' అని కూపీలాగడం-వాళ్లు ఏదో పెద్దాయన అడిగాడు కదాని మర్యాద కోసం 'బావుందనో, ఫర్వాలేద'నో అంటే అదే మనసులో పెట్టేసుకొని, అంతా బావుంటే వీళ్ల ఒక డ్యూటీ ఏం పెర్ఫెక్టుగా చేస్తారు లెమ్మని, ఏదో ఒక అదనపు పనిభారమో, టెన్షనో తెచ్చి పడేస్తే గానీ 'బావుండడం' అనేది పూర్తిగా మర్చిపోయి కాశ్మీరు సరిహద్దులో సైనికుల్లా అటెన్షన్‌గా బిగుసుకుపోయి పడుండరని ఆయన ప్రగాఢ విశ్వాసం.

నేనో రోజు, ఆయన మనసులో ఆలోచన్లు ఇలా తేనెతుట్టిలా జలజలలాడుతున్నాయని తెలీక, ''ఎలా ఉంది సార్? మీ కౌంటర్‌లో పని?'' అని ఆయనడిగిన ప్రశ్నకు సమాధానంగా ఏదో ఆయన సంతోషిస్తాడని, ముఖప్రీతి కోసం అన్నట్లు,

''చాలా హాయిగా ఉంది సార్... ఏం ప్రాబ్లం లేదు!'' అన్నాను నిండుగా నవ్వుతూ. ఆ మాటే నాకు పెద్ద ప్రాబ్లం అయి కూర్చుంటుందని నాకా క్షణాన తెలీనే తెలీదు!

''ఆఁహా! అలాగా....'' అనేసి ఆయన సాలోచనగా వెళ్లిపోయాడు. ముఖంలో ఏ భావమూ ప్రస్ఫుటం కాకుండా...తెలుగే కాదు, తమిళ, కన్నడ, తుళు లాంటి ఇతర భాషల్లోనూ....ఆఖరికి గోండు, ఖాసీ, గారో లాంటి లిపిలేని ఆదివాసీ భాషల్లోనూ 'హాయి' అనే పదం ఆయనకు నచ్చదని అసహ్యం అని, ఏవగింపు అని నాకు తెలీదంటే తెలీదు. ఒట్టు.



అలా వెళ్లిపోయినాయన కొన్ని రోజులు నా 'హాయి' గురించి దీర్ఘంగా ఆలోచించి ఓ అల్టిమేటం జారీ చేశాడు! నేనెప్పుడో రేపిన తేనెటీగలు అప్పుడు కుట్టడం ప్రారంభించాయి..

నేను కూర్చునే సెంటర్ టేబిల్ అనే క్యాష్ కౌంటర్‌లో లెక్కకు మిక్కుటంగా వచ్చిపడే క్యాష్‌ను నోట్ కౌంటింగ్ మిషన్‌లో నిర్విరామంగా లెక్కించవలసి వస్తుంది. అందుకు సహాయకంగా నాకో మెసెంజరుంటాడు. అతని సాయంతో నేను కౌంటింగ్ పనిని తేలిగ్గా పూర్తిచేస్తుంటాను.

మేనేజరు, సెంటర్ టేబిల్ వద్ద మెసెంజర్ అవసరం ఎంత మాత్రమూ లేదని, వచ్చిన క్యాషంతా స్వయంగా నేనే కౌంట్ చేసుకోవాలని ఆర్డర్ వేసి మెసెంజర్ని కాస్తా వేరే పనికి తప్పించేశాడు. ఇహ చచ్చీ చెడీ రెండు పన్లూ నేను చేసుకుంటూంటే, అప్పుడు అందరితో పాటూ నాకు బాగా అర్థమయింది. మేనేజరు ఎదుట చాలా జాగరూకతో మాట్లాడకపోతే నూకలు చెల్లిపోతాయని!

అప్పట్నించి, బ్రాంచి స్టాఫంతా మేనేజరు పలకరిస్తే చాలు ప్రపంచంలో దుఃఖభారమంతా తామే మోస్తున్నట్లు, ఏడుపు మొహాలతో, 'వాఁ...!' అంటూ సైరన్‌కూతల్లా... అరవడం మొదలుపెట్టారు.

మరీ అలా అరవడం సిగ్గయినవాళ్లు దేభ్యం మొహాలతో ''చచ్చిపోతున్నాం సార్ పనిచెయ్యలేక...వేగలేకపోతున్నాం సార్ ఈ కష్టమర్లతో'' అని, ఆడాళ్లయితే గుడ్లనీరు కక్కుకుంటూ చీర చెంగుతో కళ్లొత్తుకుంటూ గూడు కట్టిన విషాదానికి సింబాలిక్‌గా, కన్నాంబ, సావిత్రిల్లా నిలబడే విచారాలొలికిస్తూ....ఇక మెసెంజర్లు చినిగి మాసికలు కట్టిన బట్టలు, రేగిన జుట్టుతో చేతులు పిసుక్కుంటూ సిన్మా కష్టాలతో ఇంటా బయటా ఆఫీసులో చితికిపోతున్నాం సార్! అంటూ బావురుమంటూ కనిపించేసరికి...

ఆయన, మెరిసే కళ్లతో, తృప్తి నిండిన మనసుతో 'పోన్లే ఫర్వాలేదు అంతా సజావుగానే సాగుతోందన్నమాట...ఎవరి పన్లు వాళ్లు కష్టపడి అయినా నిర్వర్తిస్తున్నారన్నమాట...శభాష్' అనుకుంటూ ఎవరిజోలికి రాకుండా వెళ్లిపోయేవాడు. ఆయనటు వెళ్లగానే మా నవ్వులు, ఆనందాలు మామూలే.

***

అంతా సజావుగా సాగితే అది జీవితం ఎందుకవుతుంది? అందుకే మళ్లీ సమస్య పుట్టుకొచ్చింది. ఎవరయినా లీవు పెడితే, మేనేజరు హత్యానేరంగా పరిగణించి అటెండెన్స్ రిజిస్ట

రులో వాళ్లకు అబ్సెంట్లు, రీమార్కులు రాయడంతో,

మేమంతా ఓరోజు ఆయన క్యాబిన్‌లో పులిబోనులో కెళ్లిన పిల్లిపిల్లలా దూరి....'కష్టించి పనిచేస్తున్న మమ్మల్ని ఇంకా పని-డిసిప్లెన్ అంటూ ఉక్కు చట్రంలో బిగించడం న్యాయం కాదని, లీవులు, నవ్వులు, మాటలు లాంటి సాంఘిక కార్యకలాపాల్లో చూసీ చూడనట్లు పోవాలని' అభ్యర్థించాం.

అందుకాయన, ''పై అధికార్ల నుంచి ఎన్ని విధాల వత్తిడులు వస్తున్నాయో మీకేం తెలుసు?ఇక్కడ కూర్చుంటే తెలుస్తుంది. వాళ్లకీ, మీకూ మధ్య నేను నలిగిపోతున్నాను. స్టాపు తక్కువ ఉన్నందువల్లే లీవులు ఇవ్వడం లేదు. నేనేదో మిమ్మల్ని కష్టపెడుతున్నట్లు మీకనిపించినా నిజానికి నా డ్యూటీ నేను చేస్తున్నానంతే!

కష్టపడి పన్జెయ్యడం అంటారా అది పాత మాట. ఇప్పుడు బ్యాంకింగ్ రంగంలో విస్తృతమైన పోటీరీత్యా పనిని ఇష్టపడి చేయడమే కొత్త థియరీ. అది అలవర్చుకోండి!'' అన్నాడు.

''ఇష్టపడి పన్జెయ్యడమంటే...పన్జెయ్యడం కాదా?'' అడిగాడు మా లీడరు నాథ్.

''పనిచెయ్యడమే..ఏదో కోల్పోతున్న ఫీలింగ్‌తో కాక నవ్వుతూ హ్యాపీగా చెయ్యడం. టెన్స్‌గా కాకుండా మోడె



స్టీగా ఉండడం'' అన్నాడు మేనేజర్ కూల్‌గా.

అవాక్కయ్యాం. భూమి గుండ్రంగానే ఉందని, మా సమస్య కూడా రుజువు చేస్తున్నట్టనిపించింది... అందరి మనసులో మాట తన నోట పలికిస్తున్నట్లు మా నాథ్, ''పదుల సంఖ్యలో కష్టమర్లొస్తే మీరు చెప్పిన స్మైల్ అండ్ రిలాక్స్‌డ్ థియరీ సాధ్యం...ఇలా కుప్పలు తెప్పలుగా కష్టమర్లొచ్చి పడుతోంటే ఏ థియరీ నిలుస్తుంది చెప్పండి?''

అప్పటికి...మేం ముందు చిరునవ్వుతో పనిచేస్తుంటే తమరు కెమెరాల్లోంచి చిర్రుబుర్రులాడారు. పోన్లే అని మీకు నచ్చినట్లు సీరియస్‌గా చేస్తుంటే ఆబ్సెంట్లు వేస్తున్నారు. అదేమంటే ఇష్టపడి పనిచెయ్యాలంటున్నారు. అసలు మేమెలా ఉండాలి సార్! సీరియస్‌గానా? నవ్వుతూనా? మోడెస్టీగానా? మూడు కలగలిపా లేదా మూడు కాకుండానా?'' అంటూ ఆపోయాడు.

''పని మానేసి నవ్వులు, మాటలు పెట్టుకోవద్దని చెప్పానే తప్ప, సంతోషంగా ఉండొద్దని ఎవ్వరికీ చెప్పలా! పని చెయ్యండి, సరదాగా ఉండండి....దట్సాల్, ఏ సమస్యా ఉండదు.'' అన్నాడాయన.

''మేం పని పూర్తి చేసి నవ్వుతూ కూర్చుంటాం అని మీకెలా తెలుస్తుంది?మేం పని మానేసి నవ్వుతున్నామో పని చేసేసి నవ్వుతున్నామో?'' లా పాయింటు లాగి తాపీగా చూశాడు నాథ్ నాధుడు.

'శభాష్' అనుకొన్నాం అంతా మనసుల్లో. నిజమే, ఆది అంతం లేని మా పని. ఏ పని ఎక్కడకు పూర్తవుతుందో, ఎక్కడ మొదలవుతుందో చేసే వాళ్లం మాకు తప్ప ఎవరికీ తెలీదు. దాంతో పని ఎగ్గొడుతున్నామో, చేసి రిలాక్స్ అవుతున్నామో కనిపెట్టడం బ్రహ్మతరం కూడా కాదు.

గుర్రాన్ని నీటి చెలమ దాకా తీసికెళ్లగలమేమో కానీ బలవంతంగా నీళ్లు తాగించలేం కదా. ఇదీ అంతే...ఏదయినా మనం మనస్ఫూర్తిగా చెయ్యాలే కానీ ఈ దిక్కుమాలిన థిరీలేంటి? ఇష్టపడి పనిచెయ్యండి కష్టపడి పనిచెయ్యండి అంటూ... మనం మనుషులం. మనకూ మనసుంటుంది. పన్జెయ్యకపోతే అది పీకుతూ ఉంటుంది. మనసుని థీరీలతో కట్టెయ్యాలని చూస్తే అది కోతిలా గెంతి, చెట్టెక్కి కూచుని 'వ్వెవ్వె' మని వెక్కిరిస్తుంది.

మా ప్రశ్నకు బ్రహ్మాస్త్రంలా మేనేజరు థియరీని కట్టిపడేసింది. ''సరే, సరే... ఏదోలా పనిచెయ్యండి చాలు..లీవులు అవసరం ఉంటే పెట్టుకోండి ఏం చేస్తాం? జోనల్ ఆఫీసునుంచి మాత్రం నాకు పనులు పెండింగ్ ఉండిపోతున్నాయని మాట మాత్రం రాకూడదు...సరేనా?'' అన్నాడు రాజీకి వచ్చి.

అంతా రిలాక్సయి, ''అలా అన్నారు బావుంది. మీరు కూడా మమ్మల్ని కెమెరాల్లోంచి చూసి పనిమానేసి నవ్వుకుంటూన్నారని అపార్థం చేసుకోకండి. మమ్మల్ని మీరు నమ్మండి. మిమ్మల్ని మేం నమ్ముతాం. ఇదే అన్ని థీరీలను మించిన థియరీ'' అనేసి మేమంతా ఆనందంగా వెళ్లిపోయాం.

నిజానికి ఆయన మాకేం శత్రువు కాదు. ఎందుకంటే, మెసెంజరు దగ్గర్నుంచి మేనేజరు దాకా అంతా ఒక తాను గుడ్డలమే. ఎంత చెట్టుకంత గాలి అన్నట్లు. చిన్న ఉద్యోగులం మాకే ఇంత టెన్షన్లుంటే, సాక్షాత్తు అందర్నీ నడిపించే మేనేజరు, ఆయనకెన్ని టెన్షన్లుండాలి. పై వాళ్ల నుంచి ఎన్ని వత్తిడిలుండాలి? అన్నీ అర్థం చేసుకుంటున్నాం కాబట్టే, మేం ఎప్పుడూ మా బాధ ఆయనకు తెలియజెప్పుకోవాలని చూస్తామే తప్ప ఆయన్ని బాధప పెట్టాలని, ఇబ్బంది పెట్టాలని అనుకోనే అనుకోం. మర్నాటి నుంచి ఆయన నిఘా తగ్గి మాకు పని మరింత బాగా చెయ్యడానికి వెసులుబాటు చిక్కింది.

అయినా మొదటి వారాల్లో, శెలవులకు ముందు వెనక రోజుల్లో శత్రు దేశాల సైనికులు (పోలికకు క్షమించాలి) దండెత్తి వచ్చినట్లు, కష్టమర్లు నేల ఈనినట్లు పుంఖాను పుంఖాలుగా పుట్టుకొచ్చి రకరకాల పనుల నిమిత్తం నింపిన ఓచర్లు మా ముఖాల ముందు పెడుతుంటే,

మొక్కవోని ధైర్యంతోఅలుపులేని ఆత్మవిశ్వాసంతో శరీరంలో అనారోగ్యాలు, ఇంటి వద్ద సమస్యలు పక్కన పెట్టి కళ్లు, మనసు, శరీరం చేసే పని మీదే లగ్నం చేసి ఓ యజ్ఞంలా ఓ విత్తనం నాటినట్టు ఓ ఆపరేషన్ చేసినట్లు దీక్షగా సహనంతో సంయమనంతో ఎత్తిన పెన్ను దించకుండా పోరాటం ఆపకుండా, అలుపూ, సొలుపూ లేకుండా శరీరం బిగించుకొని ప్రకృతి అవసరాలు ఆపుకుని భేదాభిప్రాయాలు పక్కన పెట్టి, మాకూ మా కుటుంబాలకీ ఏ లోటూ లేకుండా కన్న తల్లిలా కాపాడుతున్న మిలమిల మెరిసే మా బ్యాంకు ఎంబ్లమ్‌ని, ఫెళఫెళ ఎగిరే జాతీయ పతాకంలా భావించి జేబున పెన్‌ని భుజాన గన్‌లా దాల్చి సెల్యూట్ చేసినట్లు ఎలాంటి పనినైనా చకచకా పూర్తి చేసే మా కర్తవ్య దీక్షని...

కమ్మని మనసున్న కష్టమర్లు ఏనాడో గుర్తించారు. నిండుగా దీవించారు. ఆ 'కాంప్లిమెంట్' అన్ని థియరీలను మించిన మా నిజమైన విజయ రహస్యం!

*


చిరునామా
బి.పురుషోత్తం
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
మెయిన్ రోడ్, రాజోలు-533242
తూర్పుగోదావరి జిల్లా
సెల్: 9949800253


# త్రిషా, ధనుష్ జంటగా తమిళ సినిమా

'నువ్వొస్తానంటే వద్దంటనా....' అంటూ తన తొలి సినిమా 'వర్షం'తో అందరి హృదయాలు కొల్లగొట్టిన త్రిషా తెలుగు, తమిళ చిత్రాలలో సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. తమిళంలో దాదాపు అగ్రహీరోలు అందరి సరసన నటించిన త్రిషా తొలిసారిగా ధనుష్ జంటగా చేస్తోంది. కొన్ని దశాబ్దాల క్రితం జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ మదురైలో అతి త్వరలో ప్రారంభం కాబోతోంది. ఇందులో త్రిషా ఆంగ్లో ఇండియన్ అమ్మాయిగా నటిస్తోంది. ఇది కాకుండా గౌతమ్ మీనన్ రూపొందిస్తున్న మరో సినిమాలో కూడా నటిస్తోంది. తెలుగులో గోపీచంద్ సరసన, విక్టరీ వెంకటేష్ సరసనా నటిస్తోంది.

